క్లుప్తంగా

దీపావళి ప్రజల జీవితాల్లో సంతోషం నింపాలి



చిలకలపూడి(మచిలీపట్నం): ఈ దీపావళి ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగించి సంతోషపు వెలుగులు నింపాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొంది ఆర్థికంగా అభివృద్ధి చెంది ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలను తెలిపారు.

జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్‌నాయుడు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి కుటుంబంలో వెలుగులు నింపాలని, సంతోషాన్ని కలిగించాలని, నూతన ఆనందాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. అలాగే దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ తమ పిల్లాపాపలతో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా పెద్దల సమక్షంలో అత్యంత జాగ్రత్తగా జరుపుకోవాలని సూచించారు.

కొత్త వ్యక్తుల సమాచారం ఇవ్వండి



గుల్లలమోద(నాగాయలంక): మండలంలోని తీరప్రాంత గ్రామమైన గుల్లలమోదలో పాలకాయతిప్ప కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్(సీఎస్‌పీఎస్) ఇన్‌స్పెక్టర్ ఆర్.సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగాయలంక ఎస్‌ఐ కలిదిండి రాజేష్, సిబ్బందితో కలసి ఆదివారం ప్రజలకు కమ్యూనిటీ అవగాహన నిర్వహించారు. గ్రామంలో అధికారులు మాట్లాడుతూ తీర గ్రామాల్లో మత్స్యకారులు నిరంతరం చైతన్యంతో ఉండాలని కోరారు. కొత్త వ్యక్తుల సంచారం గర్తించి సమాచారం మెరైన్ పోలీస్ అధికారులు, సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. చేపల వేటకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణం మెరైన్, ఎల్ అండ్ ఓ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎలాంటి కష్ట సమయంలోనైనా నిబంధనలు విధిగా పాటిస్తూ గ్రామస్తులంతా ఐక్యతతో పరస్పర సహకారంతో ఉండాలని వివరంచారు. సంఘమిత్ర సంస్థ ప్రతినిధి జి.గోపినాథ్, మెరైన్ పోలీస్ స్టాఫ్, పెద్దలు, వేట మత్స్యకారులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి మాస శివరాత్రి అభిషేకాలు



నాగాయలంక: మాస శివరాత్రి, నరకచతుర్థశి పర్వదినాలు పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ శ్రీగంగ పార్వతీ సమేత రామలింగే శ్వరస్వామి మండపంలో స్వామివారికి ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అభిషేకాలు, హారతులు సమర్పించారు. అంబా సాయికిరణ్‌శర్మ నేతృత్వంలో పండితుల బృందం వివిధ అభిషేకాలు, మాస శివరాత్రి ప్రత్యేక పూజ, అలంకారం నిర్వహించారు. స్వామివారిని పండితులు సుందరంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించి భక్తులకు ఆశీస్సులు అందించారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, తలశిల రఘుశేఖర్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్ (బుజ్జి), కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

గుడివాడ టౌన్: దీపావళి సందర్భంగా భారీగా బాణసంచా పేల్చి పర్యావరణాన్ని కాలుష్యం చేయవద్దని ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చడం వల్ల డబ్బు వృథాతో పాటు వాతావరణం కలుషితం అవుతుందని.. ప్రజలు ఈ విషయం గ్రహించాలని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ జి.జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరపాలి

గుడివాడ టౌన్: మోపిదేవి గురుకుల పాఠశాల బీసీ హాస్టల్ విద్యార్థి ఎ.భార్గవ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల కాలంలో హాస్టల్ విద్యార్థులకు పచ్చకామెర్లు, మలేరియా వంటి వ్యాధులు సోకుతున్నాయని.. ఇంత వరకూ రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఏ విధమైన చర్యలు తీసుకోవడంలేదని అన్నారు. భార్గవ్ మృతిపట్ల సమగ్ర విచారణ జరిపితే మృతికి కారణం తెలుస్తుందని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

తవ్వారు.. వదిలేశారు

- అధ్వానంగా ఘంటసాల–అంబేడ్కర్ నగర్ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



నేడు: ఘంటసాల- అంబేడ్కర్ నగర్ రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

ఘంటసాల: గత కొన్ని రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు ఘంటసాల నుంచి అంబేడ్కర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి నీటి కుంటలను తలపిస్తోంది. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈ రోడ్డు మీదగానే మల్లంపల్లి, బొల్లపాడు, మూడు పల్లెలకు ప్రయాణిస్తుంటారు. ఆయా గోతుల్లో మోకాళ్లలోతు నీరు నిల్వ ఉండేదని స్థానికులు తెలిపారు.

నాలుగు నెలలకు పైగా గడిచినా..

అయితే ఈ ఏడాది జూన్ 9న ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆదేశాల మేరకు ఘంటసాల సెంటర్ నుంచి అంబేడ్కర్ నగర్‌లోని పురుషోత్తం మిల్లు వరకు మండల పరిషత్ నిధులు రూ.లక్ష, పంచాయతీ నిధులు రూ.లక్షతో రోడ్డు మరమ్మతులు ప్రారంభించారు. పొక్లెయిన్‌తో ఆ రోడ్డును తవ్వి గుంతలను సరి చేశారు. కనీసం రోడ్డు రోలర్‌తో కూడా చదును చేయకపోవడంతో రోడ్డు మరింత గుంతలమయంగా మారింది. రోడ్డు గతంలో కంటే ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



నాడు: చేసేందుకు ఘంటసాల- అంబేడ్కర్ నగర్ రోడ్డును పొక్లెయిన్‌తో తవ్విస్తున్న దృశ్యం (ఫైల్)

ఇబ్బందుల ప్రయాణం..

వృద్ధులు, మహిళలు, విద్యార్థులు ద్విచక్ర వాహనాలు, సైకిళ్ల పై ప్రయాణించాలన్నా, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించాలన్నా భారీ కుదుపుల కారణంగా ఒళ్లు హూనమైపోతుందని వాపోతున్నారు. భారీ గుంతలు ఉన్నా ఎలాగోలా వెళ్లే వాళ్లమని, రోడ్డంతా గుంతలమయం చేయడంతో మరింత ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఈ రోడ్డున కాకుండా మరొక రోడ్డు నుంచి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

అధికారులు స్పందించాలని వినతి..

రూ.2 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించి నాలుగు నెలలకు పైగా గడుస్తున్నా కనీసం పనులు చేపట్టకపోవడంతో నిధులు ఏమైనట్లు అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఘంటసాల- అంబేడ్కర్ నగర్ రహదారి సమస్యను పరిష్కరించి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

వర్షంతో నీట మునిగిన నారుమళ్లు

నీటిని బయటకు తరలించేందుకు తిప్పలు



హంసలదీవి సమీపంలో నారుమడిలోని నీటిని బయటకు తరలిస్తున్న రైతు

కోడూరు: మండలంలోని తీరప్రాంత రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఖరీఫ్ సీజన్ ఆరంభమై నాలుగు నెలలు గడుస్తున్నా మండలంలోని తీరప్రాంత గ్రామాలైన హంసలదీవి, రామకృష్ణాపురం, ఊటగుండం, ఉల్లిపాలెం ప్రాంతాల్లో రైతులు నేటి పూర్తిస్థాయిలో వ్యవసాయ పనులను ప్రారంభించలేని పరిస్థితి. సీజన్ ఆరంభంలో సాగు నీటి సంక్షోభం, తరువాత భారీ వర్షాలతో ఈ ఏడాది వ్యవసాయ పనులను ఆలస్యంగా ప్రారంభించారు. ఈ ప్రాంతాల్లో 20 రోజుల నుంచే వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. హంసలదీవి–దింటిమెరక గ్రామాల మధ్య కొంతమంది రైతులు వరినారుమళ్లు పోసుకోగా, మరికొంతమంది రైతులు పొలాల్లో దుక్కులు దున్నుకొవడం, పార పని చేసుకుంటున్నారు. ప్రస్తుతం నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరినారుమళ్లు నీట మునిగాయి. నారుమళ్లు మొత్తం నీటిలో ఉండిపోవడంతో అవి దెబ్బతినే ప్రమాదం ఉంది. నీటిని బయటకు తరలించేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కుటుంబసమేతంగా పొలాల వద్దే ఉండి కొంతమంది రైతులు గుల్లపంపుల సహాయంతో, మరికొంతమంది స్టీల్ పాత్రల సహాయంతో నీటిని బయటకు పంపిస్తున్నారు. వర్షం పడినప్పుడే అధికారులు కూడా కాలువలకు నీరు విడుదల చేస్తున్నారని, వర్షాభావ సమయంలో తమను కనీసం పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామకృష్ణాపురం, ఊటగుండం ప్రాంతాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతుండగా, భారీ వర్షంతో ఈ వరినాట్లు కూడా మునబారిన పడ్డాయని రైతులు వాపోతున్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం



ఘంటసాలలో వర్షానికి మార్కెట్లో నిలిచిన వర్షపు నీరు

ఘంటసాల: గత రాత్రి నుంచి ఘంటసాల గ్రామంలో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షానికి ఘంటసాల మార్కెట్‌తో పాటు పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయ్యాయి. ఘంటసాలలో శనివారం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి ఘంటసాల–రామానగరం రహదారి, సంత మార్కెట్, గోటకంలోని పలు రోడ్లు జలమయంగా మారాయి. మార్కెట్ ప్రాంగణం చెరువును తలపిస్తుండగా వినియోగదారులు వెళ్లేందుకు ఇబ్బందులుపడ్డారు. బేరాలు లేక బాధపడాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాపారులు వాపోయారు. వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మార్కెట్లో వర్షపు నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాణసంచా దుకాణాలకు వర్షం దెబ్బ



ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో దుకాణాలు



కోడూరులో వ్యాపారులకు సూచనలిస్తున్న ట్రైనీ ఎస్‌ఐ ప్రకాష్

మచిలీపట్నంటౌన్: నగరంలో దీపావళి బాణసంచా విక్రయాలకు వర్షగండం ఎదురైంది. స్థానిక రాజుపేటలోని ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అధికారులు అనుమతించారు. దీంతో ఆవరణలో దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు సన్నద్ధమయ్యారు. అయితే ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో పల్లంగా ఉన్న ఆవరణలో వర్షపు నీరు చేరింది. దీంతో దుకాణాల ఏర్పాటుపై వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కూడా వర్షం ఇలాగే ఉంటే ఆవరణలో నీరు చేరితే బాణసంచా విక్రయాలు ఎలా చేయాలనే సందిగ్ధంలో వ్యాపారులు కొట్టుమిట్టాడుతున్నారు. మరి ప్రకృతి కరుణిస్తుందో.. ఇబ్బంది పెడుతుందో చూడాలి.

9 దుకాణాల ఏర్పాటుకు అనుమతి

కోడూరు: దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయించేందుకు మండలంలో తొమ్మిది స్టాల్స్‌కు అనుమతించినట్లు తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి ఆదివారం తెలిపారు. తొలుత స్టాల్స్‌ను సంతమార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు మార్కింగ్ ఇచ్చారని, అయితే వర్షాల కారణంగా మార్కెట్ ప్రాంగణంలో బురద ఉండడంతో బైపాస్ రహదారిలోకి మార్చినట్లు చెప్పారు. అన్నం కిషోర్ రైస్ మిల్స్ ఎదురుగా ఉన్న సిమెంట్ బ్రిక్స్ తయారీ కేంద్రం వద్ద తొమ్మిది స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వ్యాపారులు నిబంధనలకు లోబడి బాణసంచాను విక్రయించాలని తహసీల్దార్ సూచించారు. ఎస్‌ఐ చాణిక్య, ట్రైనీ ఎస్‌ఐ ప్రకాష్, స్టాల్స్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించి, వ్యాపారులకు పలు సూచనలిచ్చారు.

నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి

చల్లపల్లి: దీపావళి సందర్భంగా బాణసంచా అమ్ముకునేందుకు ఎవరిపేరు మీద అయితే అనుమతి తీసుకున్నారో వారు తప్పని సరిగా ఆయా షాపుల వద్ద ఉండాలని ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం అన్నారు. చల్లపల్లిలో మొత్తం 11 షాపులకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. ఆయా షాపుల ఏర్పాట్ల తీరును ఎస్‌ఐ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. షాపుల వద్ద నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. లేనిచో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల వద్ద నీరు, ఇసుక వంటివి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నాంచారమ్మసేవలో సినీనిర్మాత ఘట్టమనేని



మనవరాళ్లకు ఉయ్యాల వేడుక నిర్వహిస్తున్న ఆదిశేషగిరిరావు, పక్కన ఎమ్మెల్యే

కోడూరు: కృష్ణాతీరంలోని విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని సినీనటుడు కృష్ణ సోదరుడు సినీనిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం ఆదిశేషగిరిరావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. నాంచారమ్మకు పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మనవరాళ్లకు ఉయ్యాల వేడుకను ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అధికారిణి జయశ్రీ ఆదిశేషగిరిరావు దంపతులకు అందించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) కూడా వీరితో పాటు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉప్పెన సమయంలో ముందుగా స్పందించిన హీరో కృష్ణ

అవనిగడ్డ: దివిసీమ ఉప్పెన సమయంలో సహాయ కార్యక్రమాల నిర్వహణ కోసం సినీ హీరో కృష్ణ ముందుగా స్పందించి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చొరవ చూపారని ఆయన సోదరుడు, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు అన్నారు. ఆదివారం దివిసీమ విచ్చేసిన ఆదిశేషగిరిరావు మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు విగ్రహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివిసీమ ఉప్పెన సమయంలో మండలి వెంకటకృష్ణారావు అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్తిక పూజలకు ఆలయాలు ముస్తాబు



పెదతుమ్మిడి శివాలయంలో అగస్త్యేశ్వరస్వామి

బంటుమిల్లి/పెడన: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వేంచేసి ఉన్న శివాలయాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కార్తికమాసం సందర్భంగా ప్రత్యేక పూజలకు నిర్వాహకులు సిద్ధం చేశారు. బంటుమిల్లి గ్రామంలోని గంగా పార్వతీ సమేత చంద్రమౌళేశ్వరస్వామి, పెదతుమ్మిడి గ్రామంలోని పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి, అర్తమూరు గ్రామంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, ఆముదాలపల్లి గ్రామంలోని గంగా పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి, కంచడం గ్రామంలోని కాత్యాయిని సమేత కనకలింగేశ్వరస్వామి, ములపర్రు గ్రామంలోని పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెడన పట్టణ పరిధిలోని గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో ఏర్పాట్లు చేశారు.

నాగాయలంక: మండలంలోని పలు శివాలయాలు కార్తిక మాసోత్సవాలకు ముస్తాబయ్యాయి. స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్ద కృష్ణానదిలోని శ్రీరామలింగేశ్వర స్వామి మండపంలో ఈ నెల 22వ తేదీ నుంచి కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తామని క్షేత్రం చైర్మన్ లయన్ ఆలూరి శ్రీనివాసరావు, ప్రతినిధి ఉప్పల బుజ్జి ఆదివారం చెప్పారు. స్థానిక శ్రీపార్వతీసమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు విలేకరులతో మాట్లాడుతూ 22వ తేదీ నుంచి నవంబరు 20వ తేదీ వరకు 33వ వార్షిక కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కే.భానుప్రసాద్ ఆశీస్సులతో శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య మంగళశాసనాలతో ఉత్సవాలు జరుగుతాయన్నారు. మట్టి శివలింగాలతో సామూహిక పూజలు, అఖండ కర్పూరజ్యోతి పూజలు, వన సమారాధనలు ఉంటాయన్నారు.

పొడి చెత్త సేకరణకు స్వచ్ఛ రథాలు ప్రారంభం



అవనిగడ్డ: ప్రజలు స్వచ్ఛ రథాలను సద్వినియోగం చేసుకుని పొడి చెత్త ఇచ్చి బదులుగా నిత్యావసర సరుకులు తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో అవనిగడ్డ, నాగాయలంక, చల్లపల్లి గ్రామ పంచాయతీల కోసం ఎంపిక చేసిన స్వచ్ఛ రథాలను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ గృహాలు, దుకాణాల్లోని పొడి చెత్తను ఆరు బయల పారవేయకుండా స్వచ్ఛ రథాలకు అందించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఎంపీడీఓ మరియాదేవి, సర్పంచులు పైడిపాముల కృష్ణకుమారి, కైతేపల్లి అంకాలు, పంచాయతీ ఈవోలు తోట శ్రీనివాసరావు, పీవీ మాధవేంద్రరావు, పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పృథ్వీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



చల్లపల్లి: మండల పరిధిలోని నడకుదురులో వేంచేసిన శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత పృథ్వీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నరకాసుర సంహార కార్యక్రమాన్ని న్విహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబ సమేతంగా విచ్చేసి తొలుత స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన నరకాసురుని ప్రతిమకు బుద్ధ ప్రసాద్ విల్లు ఎక్కుపెట్టి అగ్ని బాణాలను సంధించి దహనం చేశారు. ఆలయ అర్చకులు మావిళ్లపల్లి పృథ్వీశర్మ, కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిచారు. ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు మల్లుపెద్ది త్రివిక్రమరావు, రిటైర్డ్ ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లాకు వీఎం రంగా పేరు పెట్టాలి



మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లాకు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని రాధా- రంగా మిత్రమండలి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు ఈ డిమాండ్ ను చేశారు. ఈ సందర్భంగా రాధా- రంగా మిత్రమండలి కృష్ణా జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించి కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను మిత్రమండలి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు అందజేశారు. ఈ సమావేశంలో న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, నాయకులు వల్లమూడి చిన్న, మాదివాడ రాము, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బత్తిన రమేష్ బాబు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పుప్పాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండ్లపై ఇసుక రవాణా



చల్లపల్లి: మండల పరిధిలోని నడకుదురు ఇసుక క్వారీ నుంచి ఎద్దుల బండ్లపై అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. తెల్లవారుజామున, ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా ఈ రవాణా సాగిస్తున్నారు. నడకుదురు, నిమ్మగడ్డ ఇసుక క్వారీలు కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్‌జెడ్) పరిధిలో ఉన్నాయి. పర్యావరణం, వనరుల సంరక్షణ రక్షణలో భాగంగా ఈ సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న ఇసుక క్వారీల నుంచి ఇసుకను తరలించటం నిషేధించారు. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు లెక్కచేయకుండా ఇల ఎద్దుల బండ్లపై తీసుకుపోతున్నారు. రూ.800 నుంచి రూ.1000 వరకూ దూరాన్ని బట్టి అమ్ముకుంటున్నారు. అధికారులు స్పందించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం

ఘంటసాల: స్థానిక క్రిస్టియన్ పేటకు చెందిన కొక్కిలిగడ్డ క్రాంతి కుమార్ ఇటీవల డీఎస్సీ పరీక్షలు రాసి విజయం సాధించి మొవ్వ గ్రామంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా చేరారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ పేటలోని బాప్టిస్టు చర్చిలో సామాజిక కార్యకర్త నందేటి శ్రీనివాసరావు, షామియానా బాషా, దిరిశం శ్రీను, కె.సాల్మన్ రాజు ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుడు క్రాంతి కుమార్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఆదివారం ఘనంగా సన్మానించారు. క్రిస్టియన్ పేట గ్రామస్తులు, చర్చి విశ్వాసులు పాల్గొన్నారు.